క్లుప్తంగా

కుల గణన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల జన గణన చేసి జనాభా దామాషా నిష్పత్తి ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతి కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కుటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు అవుతున్న నెరవేరని బీసీల హామీలు..రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్క వాగ్దానం నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలలో 34శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని చెప్పారు. కాని బీసీ కుల గణన జరపకుండా ఏ విధంగా 34 శాతం ఇస్తారని ప్రశ్నించారు.

27న గుర్రం జాషువా జయంతి సభ



లక్ష్మీపురం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సభ ఈ నెల 27వ తేదీ నిర్వహించనున్నట్లు గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు తెలిపారు. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ప్రచార కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ప్రముఖ సాహితీ వేత్త, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవికి 2025 జాషువా సాహిత్య పురస్కారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీలు ఎం.వి.ఎస్.శర్మ, కె.ఎస్.లక్ష్మణరావు, ఏసీ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ పి.ముత్యం పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 21న పద్యపఠన పోటీలు సీనియర్, జూనియర్ విభాగంలో 2/6 బ్రాడీపేటలోని యు.టి.ఎఫ్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ, సి.ఐ.టి.యు. జిల్లా కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ, డి.వై.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి వై.కృష్ణకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సమీర్ పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్‌లకు నిధులు మంజూరు చేయాలి

లక్ష్మీపురం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లకు నిధులు మంజూరు చేయాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ పిలుపులో భాగంగా వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ మేడా హనుమంతరావు, అరుణ్ కుమార్‌రావు, అంజిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో జంగాల చైతన్య మంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధ్యాపకులు నవ సమాజ నిర్మాతలు



గుంటూరు ఎడ్యుకేషన్: నవ సమాజ నిర్మాణంలో అధ్యాపకులు కీలక పాత్ర పోషిస్తున్నారని, తరాల మధ్య జ్ఞాన వారధులు అధ్యాపకులని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులు డాక్టర్ జీవీ సుధీర్ కుమార్, డాక్టర్ ఏ అంజనీ కుమార్, బి.జ్యోతికి ఏపీ ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాన్ ఇండియా ఐకాన్ పురస్కారాలు అందుకున్న సందర్భంగా శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, కళాశాల అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాం సుందర్ మాట్లాడారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

పట్నంబజారు:గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. కమ్మ శేషయ్య గ్రౌండ్ సమీపంలోని పీవీ నగర్ వద్ద గంజాయి విక్రయాలు జరుపుతున్నట్లు పక్కా సమాచారంతో శుక్రవారం దాడిచేశారు. దుర్గాప్రసాద్, పుల్లారావు, విజయ్, షేక్ మదార్, సుదర్శన్‌రెడ్డిలను గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఒడిశా ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ పొట్లాలు చేసి విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితుల నుంచి సుమారు కిలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నారు.

బీజేపీకి బ్రాంచి ఆఫీస్‌లా ఈసీ

లక్ష్మీపురం: భారత ఎన్నికల కమిషన్ (ఈసీ) స్వతంత్ర సంస్థగా కాకుండా బీజేపీకి బ్రాంచ్ ఆఫీస్ లా పనిచేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ విమర్శించారు. కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన ఎన్నికల కమిషన్ స్వయంగా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం దేశానికి ప్రమాదకరమన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని, దీనికి తోడ్పడుతున్న ఈసీపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

● మురుగు కంపు...



అసలే అంటువ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణం. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే ఆస్పత్రి నిండా డయేరియా కేసులు. గుంటూరు జీజీహెచ్ ఓపీ విభాగం వైపు ఉన్న టీబీ కేంద్రం వద్ద మురుగు నీరు చేరి తటాకాన్ని తలపిస్తోంది. చికిత్స, వ్యాధి నిర్ధారణ పరీక్షలకు వచ్చే రోగులు, సహాయకులు ఇబ్బందులకు గురవుతున్నారు. భరించలేని దుర్వాసన వెదజల్లడంతోపాటు ఈగలు, దోమలు చేరి కుడుతున్నాయని వాపోతున్నారు.

– గుంటూరు మెడికల్

● ఇరుక్కుపోవాల్సిందే...



నగరంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షం కురవడంతో నగరంలో లోతట్టు ప్రాంతాలు మూడు వంతెనలు, కంకరగుంట అండర్‌పాస్, కొత్తపేట, బొంగరాలబీడు, నెహ్రూనగర్, విద్యానగర్, ఉమెన్స్ కాలేజ్ రోడ్డు, పాతగుంటూరు, కొరిటెపాడు, అరండల్‌పేట, బ్రాడీపేట తదితర ప్రాంతాల్లో వీధులన్నీ జలమయం అయ్యాయి. మూడువంతెనల నుంచి రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

–నెహ్రూనగర్

బీజేవైఎం ఆధ్వర్యంలో రేపు నమో యువ రన్

గుంటూరు మెడికల్: భారతీయ జనతా యువ మోర్చా(బీజేవైఎం) గుంటూరు జిల్లా అధ్యక్షుడు మైల హరికృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం నమో యువ రన్ నిర్వహించనున్నారు. పోస్టర్‌ను బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు శుక్రవారం ఆవిష్కరించారు. ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి రన్ ప్రారంభమవుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో యువ మోర్చా నాయకులు చల్ల కౌశిక్, గుంటూరు జిల్లా యువ మోర్చా ప్రధాన కార్యదర్శి తుంగ యశ్వంత్, బీజేపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, బీజేపీ జిల్లా సేవా పక్వాడ కార్యక్రమం కన్వీనర్ చరక కుమార్ గౌడ్, యువ మోర్చా జిల్లా కార్యదర్శి రాజా, యువ మోర్చా జిల్లా కోశాధికారి మల్లెల గోపి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న హరికృష్ణ, తిరుపతిరావు తదితరులు

వణికిస్తున్న డయేరియా

- 80కు చేరిన బాధితులు
- రోజురోజుకూ పెరుగుతున్న సంఖ్య
- కట్టడిలో విఫలమవుతున్న యంత్రాంగం
- ఆందోళనలో ప్రజలు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

గుంటూరు మెడికల్: గత నాలుగు రోజులుగా గుంటూరు నగర ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్న డయేరియా రోజురోజుకూ పెరిగిపోతోంది. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారి సంఖ్య 80కు చేరుకుంది. ప్రతిరోజూ రాత్రి వేళల్లో బాధితులు చికిత్స కోసం అడ్మిట్ అవుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో సైతం అడ్మిట్ అవుతున్నా ఆ లెక్కల వివరాలను వైద్యాధికారులు దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. డయేరియా కట్టడిలో అధికార యంత్రాంగం విఫలం అవడం వల్లే బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. కొద్దిరోజులుగా వర్షం కురుస్తూనే ఉండటం, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు పేరుకు పోవడం, డ్రెయినేజీ వాటర్ మంచినీటి కుళాయిల్లో కలవడం వల్ల బాధితుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హెల్త్ బులెటిన్ విడుదల ఏదీ ?

సాధారణంగా ఆరోగ్య విపత్తు తలెత్తినప్పుడు అధికారులు హెల్త్ బులెటిన్ విడుదల చేస్తారు. దీనివల్ల ప్రజలు అప్రమత్తమై వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ఉపయోగపడుతుంది. రోగుల సంఖ్య రోజుకురోజుకూ పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బాధితుల సంఖ్య మీడియాకు తెలియజేయకుండా గోప్యంగా ఉంచుతున్నారు. డయేరియా ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వ్యాధి ప్రబలకుండా అప్రమత్తం చేసేందుకు తప్పనిసరిగా హెల్త్ బులెటిన్ విడుదల తప్పనిసరి. బాధితులు ఉంటున్న ఏరియా, వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. కానీ ఆసుపత్రి అధికారులు గానీ, ఇతర ప్రభుత్వ యంత్రాంగం గానీ ఎక్కడా కూడా డయేరియా ఉన్నట్లు వివరాలు వెల్లడించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

రిపోర్టుల వెల్లడిపై జాప్యం

సాధారణంగా డయేరియా వ్యాధి నిర్ధారణ రెండు రోజుల్లో చేస్తారు. కానీ ఆసుపత్రి అధికారులు నాలుగు రోజులుగా బాధితుల పరీక్షల రిపోర్టులు రాలేదంటూ మీడియాను పక్కదారి పట్టిస్తున్నారు. రిపోర్టులు వస్తే డయేరియానా, కలరానా లేక ఇతర సమస్య అనే విషయం అర్థమవుతోంది. ఆసుపత్రి అధికారులు రిపోర్టులు ఇంకా రాలేదంటూ ఎందుకు దాస్తున్నారో అంతు చిక్కని ప్రశ్నగా మారింది.

పత్తా లేని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు

ఒక పక్క డయేరియా కేసులు ఆసుపత్రిలో రోజురోజుకూ పెరిగిపోతున్నా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల జాడ లేదు. ఆహార కల్తీలు, నీటి కలుషితం కారణమని పలువురు వైద్య నిపుణులు వెల్లడిస్తున్నా వారు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. నీటి పరీక్షలు నిర్వహించడం, కలుషిత ఆహార పదార్థాలు విక్రయించకుండా తనిఖీలు చేయాల్సిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పత్తా లేకుండా పోయారన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి కాలుష్యం, ఆహార కాలుష్యాన్ని అరికట్టాలని, డయేరియా ప్రబల కుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

‘గ్రీన్ గుంటూరు’లో భాగస్వాములుకండి

మేయర్ కోవెలమూడి రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

నెహ్రూనగర్: నగరంలో ఈ సీజన్‌లో ఐదు లక్షల మొక్కలు నాటడం ద్వారా నగరాన్ని గ్రీన్ గుంటూరుగా తీర్చిదిద్దుకోవడంలో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల భాగస్వామ్యం అవసరమని మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై సమావేశం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వార్డుల్లో అవకాశం ఉన్న ప్రతి ప్రాంతంలో మొక్కలు నాటాలన్నారు. గుంటూరు నగరంలో పచ్చదనం పెంపు ద్వారా పరిశుభ్రమైన నగరంగా రానున్న కాలంలో జాతీయ స్థాయిలో మరో సారి స్వచ్ఛ అవార్డు పొందేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రీన్ ఏపీ థీమ్‌తో ఈ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో మొక్కలను నాటడంతో పాటు హోం కంపోస్ట్, టెరస్ గార్డెన్ నిర్వహణపై స్థానిక ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు.

కార్యక్రమ పర్యవేక్షణకు మూడు నియోజకవర్గాలకు ఒక్కో డెప్యూటీ కమిషనర్‌ను ప్రత్యేకాధికారిగా నియమించామని, కార్పొరేటర్లు తమ వార్డుకు కావాల్సిన మొక్కల వివరాలను నోడల్ అధికారులకు అందించాలన్నారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ (ఇన్‌చార్జ్) సుందర్రామిరెడ్డి, సీఎంహెచ్‌ఓ(ఇన్‌చార్జి) డాక్టర్ లక్ష్మీనారాయణ, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

నాయుడు హైస్కూల్ వద్ద సమస్యల పరిష్కారానికి చర్యలు..

నెహ్రూనగర్: అరండల్‌పేటలోని నాయుడు హైస్కూల్ వద్ద సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాయుడు హై స్కూల్ ప్రతినిధులు నగర మేయర్‌ను ఆయన చాంబర్‌లో కలసి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. మేయర్‌ను కలిసిన వారిలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

నీరు కలుషితంతోనే డయేరియా

రేట్ పేయర్స్ అసోసియేషన్



బాధితులను పరామర్శిస్తున్న నారాయణరెడ్డి

గుంటూరు మెడికల్: నగరంలో వారం రోజులుగా కలుషితమైన నీరు తాగటం వలనే డయేరియా బాధితులు పెరుగుతున్నారని రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి పేర్కొన్నారు. అసోసియేషన్ నేతలు శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ టీవీ రత్న రావు, బీసీ మహా జనసభ అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావులు డయేరియా బాధితుల పరామర్శించారు. పాత గుంటూరు, శ్రీనగర్, బొంగరాల బీడు, డొంక రోడ్డు లాంటి ప్రాంతాల నుండి అత్యధికులు వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారని కలుషితమైన నీరు తాగడమే ప్రధాన కారణమని తెలిపారు. కార్యక్రమంలో రేట్ పేయర్స్ అసోసియేషన్ నేతలు వల్లూరి సదాశివరావు, రామాల అంజిరెడ్డి, తిరుమలరావు, గోపి, జనవిజ్ఞాన వేదిక నేత గోరంట్ల వెంకట్రావు పాల్గొన్నారు.

తురకపాలెం మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చనిపోయిన వారి ఫొటోలతో నిరసన

నెహ్రూనగర్: గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో కలుషిత నీటి వలన మృతిన కుటుంబాలను ఆదుకోవాలని మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లెల వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం చనిపోయిన వారి ఫొటోలతో లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీలో కలుషితమైన నీరు తాగడం వలనే మరణాలు సంభవించాయని సదరు మరణాల విషయంలో కూటమి ప్రభుత్వం వాస్తవాలను వక్రీకరించి అసలు నిజాలను పక్కదారి పట్టిస్తుందని ఆరోపించారు. చనిపోయిన వారిపైనే నిందలు వేసే దుస్థితికి కూటమి ప్రభుత్వం దిగజారిపోయిందని మండిపడ్డారు. తురకపాలెం ఘటనపై కేంద్ర మంత్రి ఒక మాట, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఒక మాట మాట్లాడుతున్నారని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చీప్ లిక్కర్ తాగి మరణించారని చెప్పటం సిగ్గుచేటన్నారు. అక్రమంగా బోర్లు వేసి గ్రౌండ్ నీరు లాక్కొని అమ్ముకుంటున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోదా జాన్ పాల్, తురకపాలెం మాజీ సర్పంచి నక్క నాగేశ్వరరావు, మాల మహానాడు పట్టణ అధ్యక్షులు ఏచూరి వేణు, మాల ఐక్యవేదిక రాష్ట్ర యూత్ అధ్యక్షులు యామర్తి రాజు పాల్గొన్నారు.

సందడిగా ఫ్రెషర్స్‌డే



గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణతో ఫ్యాషన్ షో, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, స్టైప్ మేనేజర్ బి.రాధిక విద్యార్థినులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ బీవీ విజయభాస్కర్, కార్యదర్శి చేగు శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. కౌసల్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాధామాధవి పాల్గొన్నారు.

డయేరియా బాధితులకు పరామర్శ

లక్ష్మీపురం: జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకా విజయ్ బాధితులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్ళా సునీల్, ఏపీసీసీ డాక్టర్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జాన్ బాబు, పార్టీ నాయకులు గద్దం విజయ్‌కుమార్, బొట్లు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు శుభ్రం చేసుకోవాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాలను శుభ్రం చేయించుకోవాలని లేకుంటే అపరాధ రుసుం విధిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కావేరి నగర్, కేవీపీ కాలనీ, రత్నగిరి కాలనీ, విజయపురి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుద్ధ్యం, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖాళీ స్థలాల వలన ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమ దృష్టికి తీసుకొస్తున్నారని, ప్రజారోగ్య అధికారులు స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. నోటీసులకు స్పందించిన వారి స్థలాల్లో నగరపాలక సంస్థ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కావేరి నగర్‌లో ఖాళీ స్థలాల్లో నిలిచిన వర్షం నీరు వలన ఇబ్బంది పడుతున్నామన్న స్థానికుల ఫిర్యాదు మేరకు పరిశీలించి, తక్షణం కచ్చా డ్రెయిన్ తీసి నీటిని బెయిల్ అవుట్ చేయాలని కోరారు. జీటీ రోడ్‌లో ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచించారు. అనంతరం విజయపురి కాలనీ, రత్నపురి కాలనీల్లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాల కొలతలను, ప్లాన్‌ని పరిశీలించారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు


నెహ్రూనగర్: నగరంలో భారీ వర్షాల వలన తాగునీరు, దోమల వలన వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణకు ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీరు, దోమల వలన వ్యాప్తి చెందే వ్యాధులతో సంబంధం ఉన్న రోగుల వివరాలను జీజీహెచ్, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి సేకరించి, ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 6 గంటలకు నివేదిక ఇవ్వాలని సీఎంఓహెచ్‌ని ఆదేశించారు. ఏఎస్ఎంల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. రోగుల నివాస ప్రాంతాల్లో ఎమినిటి కార్యదర్శులు, ఏఈలు, డీఈఈలతో 6 బృందాలుగా ఏర్పడి పైప్ లైన్లు, పబ్లిక్ ట్యాప్‌లను తనిఖీ చేయాలని, నీటి సరఫరా సమయంలో క్లోరిన్ శ్యాంపిల్స్ సేకరించాలని చెప్పారు. నగరంలోని అన్ని రిజర్వాయర్లను శుభ్రం చేయడం, పైప్ లైన్లు చెక్ చేసి ఎక్కడైనా లీకులు గుర్తిస్తే తక్షణం మరమ్మతులు, డ్రెయిన్లలో పైపులైన్లు ఉంటే షిఫ్ట్ చేయడం, టెయిల్ ఎండ్ పాయింట్ల వద్ద క్లోరిన్ చెక్ చేయడం, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని కోరారు. నగరపాలక సంస్థ కాల్ సెంటర్‌కి అందే నీటి కలుషిత ఫిర్యాదులపై యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. డెప్యూటీ కమిషనర్లు నగరంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య, తాగు నీటి సరఫరా పనులను పర్యవేక్షణ చేయాలని, ర్యాండమ్‌గా అదనపు కమిషనర్ పరిశీలన చేయాలని ఆదేశించారు. కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థి అదృశ్యం



లక్ష్మీపురం: ఇంజినీరింగ్ విద్యార్థి కళాశాలకు వెళ్లి తిరిగి హాస్టల్‌కు రాక పోవడంతో యువకుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. ఏలూరు జిల్లా, మండవల్లి మండలం, తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన దావులూరి ఏలియాకు ఇద్దరు మగ సంతానం ఉన్నారు. పెద్ద కుమారుడు దావులూరి రాజ్‌కుమార్ గుంటూరులో సోషల్ వెల్ఫేర్ కళాశాల బాయ్స్ వసతి గృహం–1 హైయర్ హాల్ కాంపౌండ్‌లో ఉంటూ యనమదల కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ కంప్యూటర్ సైన్స్ విద్యాభ్యాసం చేస్తున్నాడు. అయితే ఈనెల 9వ తేదీన సాయంత్రం 5 గంటల సమయంలో రాజ్‌కుమార్‌కు తండ్రి ఏలియా ఫోన్ చేసిన ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో తోటి స్నేహితుడికి ఫోన్ చేయగా 9వ తేదీ ఉదయం 9 గంటలకు కళాశాల అని చెప్పి వసతి గృహం నుంచి బయటకు వచ్చి తిరిగి రాలేదని తెలిసింది. దీంతో తండ్రి ఏలియా గుంటూరుకు వచ్చి చుట్టు పక్కల ప్రాంతాలలో, సన్నిహితులు, బంధుమిత్రుల వద్ద ఆరా తీయ్యగా ఎలాంటి ఆచూకి తెలియలేదు. తండ్రి ఏలియా నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దావులూరి రాజ్‌కుమార్ ఆచూకి తెలిసిన వారు నగరంపాలెం పోలీస్ స్టేషన్ 0863- 2234047, సిఐ నజీర్ బేగ్ 8688831336 నంబర్లకు సమాచారం తెలియజేయాల్సిందిగా తెలిపారు.

రాష్ట్రస్థాయి టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన హర్షవర్ధన్



గుంటూరు ఎడ్యుకేషన్: సౌత్ ఇండియన్ జూనియర్ హార్డ్ టెన్నిస్ స్టేట్ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో విజయవాడలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి హార్డ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ 2025–26లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ ఉన్నత పాఠశాల విద్యార్థి చేబ్రోలు హర్షవర్ధన్ సత్తా చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. శుక్రవారం లక్ష్మీపురంలోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ అండర్–14 కేటగిరీలో ప్రథమ స్థానంతో పాటు అండర్–16లో తృతీయ స్థానంలో నిలిచాడని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ డి. దుర్గాశ్యామ్, కో–ఆర్డినేటర్లు దిల్ జహాన్, టి.శ్రీదేవి, ఇన్‌చార్జ్ కె.హరిప్రియ పాల్గొన్నారు.

99 అడుగుల మట్టి మహాగణపతికి 999 కేజీల లడ్డూ



గుంటూరు రూరల్: దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద మట్టి మహాగణపతిగా కొలువుదీరిన అమరావతి త్రిముఖ నాగ విఘ్నేశ్వరుడు 99 అడుగుల గణనాథుడి నిమజ్జన కార్యక్రమం శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించటం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీచైతన్య కళాశాల గ్రౌండ్‌లో గణపతి మండపం వద్ద కమిటీ సభ్యులు మాట్లాడుతూ అంగరంగ వైభవంగా పుణ్యనదుల నుంచి తీసుకొచ్చిన నీటితో గ్రౌండ్‌లోనే నిమజ్జనం చేయనున్నామని తెలిపారు. 21 రోజులపాటు పూజలు, హోమాలతో వైభవంగా నిర్వహించామని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం జరుగుతుందని, సాయంత్రం 4 గంటల నుంచి స్వామి వారి లడ్డూ, శ్రీశైల దేవస్థానం వారిచే అలంకరించిన వరి కంకుల మాల వేలం పాట, అనంతరం నిమజ్జన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నగర పరిసర ప్రాంత ప్రజలంతా ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని కమిటీ సెక్రటరీ లక్ష్మారెడ్డి కోరారు. కార్యక్రమంలో కమిటీ ముఖ్య నాయకులు రాజేష్, సాయి, గణేష్, గంటస్వామి, దుర్గారెడ్డి ముద్రగడ, రామాంజనేయరెడ్డి, హేమంత్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.